## 8న విద్యుత్తు బీసీ ఉద్యోగుల మహాసభ

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 19వ రాష్ట్ర మహాసభను 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు కే కుమారస్వామి ప్రకటనలో తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మహాసభలో 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపీలు ఈటెల రాజేందర్, ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు వెల్లడించారు.

## పల్లెల్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**డీపీవోల సమీక్షలో మంత్రి సీతక్క**

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రతి పల్లెనూ ఆదర్శంగా తీర్చిదిద్దాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లిప్తంగా ఉండొద్దని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని గ్రామీణ మంచినీటి సరఫరా సెంట్రల్ ఆఫీసులో డీపీవోలతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిధుల వినియోగం, పారిశుధ్య నిర్వహణ, తాగు నీటి సరఫరా, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, డైరెక్టర్ శ్రీజన తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి సైన్స్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల్లోని సైన్స్ ప్రతిభను వెలికితీసేందుకు, బాలశాస్త్రవేత్తలను గుర్తించేందుకు నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను 7నుంచి 9 వరకు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎస్ స్కూల్‌లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు 830 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయికి ఎంపికచేస్తామని తెలిపారు.

# ఎస్సీ కాలనీకి తాగునీటి కష్టాలు

- పది నెలలుగా రాని మిషన్ భగీరథ నీళ్లు
- వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్న కాలనీవాసులు
- ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని దళితకాలనీలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

గణపురం, జనవరి 5 : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సొంత మండలమైన గణపురంలోని దళిత కాలనీ ప్రజలు పది నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు రాక గోసపడుతున్నారు. అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడంతో కిలోమీటర్ల దూరం వెళ్లి.. ప్రైవేట్ బోరుబావుల నుంచి బిందెలతో తెచ్చుకొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఈ విషయమై దళితకాలనీ మహిళలు సంబంధిత అధికారులకు గోడును విన్నవించుకోగా, ఎస్సీ కాలనీకి పైపులైన్ సమస్య ఉందని, పూర్తి కాగానే నీళ్లిస్తామని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పది నెలలుగా తాగునీళ్లు లేక వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నామని, స్నానంతోపాటు దుస్తులు శుభ్రం చేసుకోవడానికి సైతం వ్యవసాయ బోర్లపైనే ఆధారపడాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ గోడు విని, దాహార్తిని తీర్చాలని కాలనీప్రజలు వేడుకుంటున్నారు.



### అధికారులు పట్టించుకోవడం లేదు

పది నెలలుగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి భగీరథ నీళ్లు రావడంలేదు. అనేకసార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి, మిషన్ భగీరథ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళిత కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించాలి.

**- కట్ల ప్రశాంతీశంకరయ్య, మాజీ సర్పంచ్**



# పర్యాటక పటంలో కోటగుళ్లు, గణపసముద్రానికి చోటు

- టూరిజం శాఖ విడుదల చేసిన వీడియోలో స్థానం
- ప్రపంచవ్యాప్తంగా పర్యాటకశాఖ ప్రచారం

గణపురం, జనవరి 5 : పర్యాటకులను ఆకర్షించేందుకు పర్యాటక శాఖ చిత్రీకరించిన వీడియోలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని కాకతీయులు నిర్మించిన కోటగుళ్లు, గణపసముద్రం సరస్సు మత్తడికి చోటుదక్కింది. పర్యాటక అందాలు, వారసత్వ కట్టడాలుగా పేరొందిన గణపురం కోటగుళ్లు, గణప సముద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి సముచిత స్థానం కల్పించింది. రామప్ప దేవాలయం, భూదాన్ పోచంపల్లి, యాదగిరిగుట్ట, పాండవుల గుట్ట, నాగార్జునసాగర్, జోడేఘాట్‌లోయ, నల్లమల, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కిన్నెరసాని వైల్డ్ లైఫ్ శాంక్చురీ ప్రాజెక్టు, కుమ్రంభీం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ (నందిపేట) వంటివి వీడియోలో ఉన్నాయి. సుమారు నిమిషం నిడివి గల వీడియోలో వీటిని పొందుపరిచారు.

# డిప్యూటీ సీఎం సభ అట్టర్‌ప్లాఫ్

- భట్టి మాట్లాడకుముందే వెళ్లిపోయిన జనం
- ఖాళీ కుర్చీలతో సభ వెలవెలా
- జనాలను ఆపే ప్రయత్నం చేసిన పోలీసులు

గీసుగొండ, జనవరి 5 : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో నిర్వహించిన సభ అట్టర్ ప్లాఫ్ అయింది. విద్యుత్ ఉపకేంద్రాల శంకుస్థాపన అనంతరం నిర్వహించిన నియోజకవర్గస్థాయి బహిరంగ సభ జనాలు లేక వెలవెలబోయింది. డిప్యూటీ సీఎం సభను విజయవంతం చేయడానికి నాలుగు రోజులుగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నియోజకవర్గంలోని 6 మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. సభకు ప్రజలను భారీగా తరలించాలని స్థానిక నాయకులకు టార్గెట్లు పెట్టారు. నియోజకవర్గం నుంచి 4వేలమంది సభకు వచ్చి ఉంటారని స్థానిక నాయకులు చెబుతున్నారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే జనాలు వెళ్లిపోవడం మొదలు పెట్టారు. డిప్యూటీ సీఎం ప్రసంగించే సమయంలో ప్రజలంతా వెళ్లిపోయారు. పోలీసులు ప్రజలను ఆపే ప్రయత్నం చేసినా జనం మాత్రం ఆగలేదు. డిప్యూటీ సీఎం మాట్లాడుతుండగానే సభ ప్రాంగణమంతా ఖాళీ అయ్యింది. తన ఎకరం 16 గంటల భూమిని సబ్‌స్టేషన్ కోసం లాక్కున్నారని, మొగిలిచెర్ల గ్రామానికి చెందిన మహిళా రైతు మేడ వరలక్ష్మి డిప్యూటీ సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని బయటకు పంపారు.



ఎల్ఈడీ స్క్రీన్‌లో డిప్యూటీ సీఎం ప్రసంగం, ఎదురుగా కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు



కరీంనగర్ జిల్లా రేకుర్తి కంటి దవాఖానలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

## నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి విరాళం

విద్యానగర్, జనవరి 5: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేకుర్తిలోని డాక్టర్ మడేకర్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఉదార నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం దవాఖానను సందర్శించిన ఆయన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పేదప్రజల కంటి ఆపరేషన్ల కోసం తన తండ్రి, టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్లూమ్స్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు పేరిట రూ.లక్ష విరాళంగా అందిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ మలేషియా అసోసియేషన్ అధ్యక్షుడు సైదం తిరుపతి రూ.50 వేల విరాళం అందిస్తున్నట్టు ప్రకటించారు. పేద ప్రజలకు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చిన జస్టిస్ వేణుగోపాల్, తిరుపతిని దవాఖాన యాజమాన్యం సత్కరించింది.



ఉచిత కంటి వైద్యశిబిరంలో డ్రైవర్‌కు అద్దాలు అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి. చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

## రోడ్డు ప్రమాదాల నివారణకు చొరవ చూపాలి

- లారీ డ్రైవర్లకు మంత్రి కోమటిరెడ్డి సూచన
- హైవేపై డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

చిట్యాల, జనవరి 5 : జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. జాతీయ రహదారిపై వెళ్లే భారీ వాహన డ్రైవర్ల కోసం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి వద్ద ఉన్న ఓ దాబా వద్ద ఆదివారం ఉచిత కంటి పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ – విజయవాడ రహదారిపై రోజూ 70 నుంచి 80 వేల వాహనాలు తిరుగుతున్నాయని, ఈ రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు మొట్టమొదటిసారిగా జిల్లా యంత్రాంగం డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎవరికైనా దృష్టిలోపం ఉంటే ఈ శిబిరంలో పరీక్షలు జరిపి తక్షణమే కళ్లద్దాలు ఇస్తున్నారని తెలిపారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చేందుకు మే నెల చివరి నాటికి టెండర్లు పూర్తి చేసి, రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు.




కల్లెడలో ర్యాలీ నిర్వహిస్తున్న నిట్ విద్యార్థులు

## కల్లెడలో నిట్ విద్యార్థుల పర్యటన

**వైద్య శిబిరం, పథకాలపై అవగాహన, జేఈఈ ప్రిపరేషన్‌పై విద్యార్థులకు గైడెన్స్**

పర్వతగిరి, జనవరి 2: వరంగల్ నిట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మండలంలోని కల్లెడ గ్రామంలో ఆదివారం గ్రామీణ సమాజాల అభ్యున్నతి కోసం సామాజిక బాధ్యతను పెంచేందుకు రూపొందించిన సామాజిక సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. నిట్ కళాశాల ఆచార్యులు రాములు, శ్యామ్ నేతృత్వంలో 54 మంది విద్యార్థులు గ్రామ సందర్శనలో పాల్గొన్నారు. కల్లెడలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నలుగురు వైద్యులు స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్ హాజరై ప్రారంభించగా, ఎన్ఎస్ఎస్ జనరల్ సెక్రటరీలు అభినవ్, దివ్య మానస పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్య, ఆరోగ్యంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధికి యువత స్ఫూర్తిదాయకంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆర్డీఎఫ్ వనితా అచ్యుతా పాయ్ విద్యాలయ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో సంభాషించి, జేఈఈ ప్రిపరేషన్ గైడెన్స్ అందించారు. అనంతరం విద్యార్థులు పర్వతగిరిలోని పర్వతాల శివాలయాన్ని సందర్శించారు. గ్రామీణ వాతావరణం చాలా బాగుందని కితాబిచ్చారు.

## కాజీపేట మీదుగా 'సంక్రాంతి' రైళ్లు

- ప్రకటించిన రైల్వే అధికారులు
- ప్రారంభమైన టికెట్ల రిజర్వేషన్

కాజీపేట, జనవరి 5 : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకొని కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా పలు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు రైళ్లు ప్రయాణించే తేదీలు, సమయాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా చర్లపల్లి–తిరుపతి మధ్య 02764 నంబర్‌తో నడిచే రైలు ఈ నెల 8, 11, 15 తేదీల్లో సాయంత్రం 6.55 గంటలకు రైలు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 07.15 గంటలకు చేరుకుంటుంది. తిరిగి తిరుపతి నుంచి 02763 నంబర్‌తో ఈ నెల 9, 12, 16 తేదీల్లో సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.00 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలు జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. కాచిగూడ– తిరుపతి మధ్య 07655 నంబర్‌తో ఈ నెల 9, 16 తేదీల్లో నడిచే రైలు సాయంత్రం 5.30కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.00 గంటలకు చేరుకుంటుంది. తిరిగి తిరుపతి నుంచి 07656 నంబర్‌తో ఈ నెల 10, 17 తేదీల్లో రాత్రి 8.05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30కు కాచిగూడకు చేరుకుంటుంది. ఈ రైలు జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లల్లో ఆగుతుంది. నాందేడ్–కాకినాడ టౌన్ స్టేషన్ల మధ్య 07487 నంబర్‌తో ఈ నెల 6, 13 తేదీల్లో నడిచే రైలు మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి కాకినాడటౌన్‌కు మరుసటి రోజు ఉదయం 8.10కి చేరుకుంటుంది. తిరిగి కాకినాడ టౌన్ నుంచి 07488 నంబర్‌తో 7, 14 తేదీల్లో సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.10 గంటలకు నాందేడ్‌కు చేరుకుంటుంది. ఈ రైలు ముథ్కేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. ఈ ప్రత్యేక రైళ్లకు 2 ఏసీ, 3 ఏసీ బోగీలతో పాటు స్లీపర్ క్లాస్, జనరల్ బోగీలుంటాయి. ఈ రైళ్లలో ప్రయాణం చేయాలనుకునే వారి కోసం రిజర్వేషన్ సౌకర్యం ప్రారంభమైందని, ప్రయాణికులు వినియోగించుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

# ఎక్కడి చెత్త అక్కడే..

- నగరంలో పడకేసిన పారిశుధ్యం
- పట్టించుకోని బల్దియా అధికారులు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు




కుమార్‌పల్లి వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం




న్యూశాయంపేట, జనవరి 5 : నగరంలో పారిశుధ్యం మళ్లీ పడకేస్తున్నది. కొన్ని కాలనీల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అత్యంత పకడ్బందీ వ్యవస్థ ఉన్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపం నగరవాసుల పాలిట శాపంగా మారింది, వీఐపీలు, ప్రధాన రహదారులు మినహా మిగిలిన కాలనీల్లో చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదు. ఇక మురికివాడల్లో పరిస్థితులు అత్యంత దుర్భరంగా ఉంటున్నాయి. కాలనీల ప్రధాన రహదారుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చెత్త కుప్పల వద్ద ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్లను సకాలంలో ఎత్తకపోవడంతో ఎక్కడికక్కడ అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జనవాసాలను పరిశుభ్రంగా ఉంచేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోగా, ఇప్పుడు ఆ పరిస్థితి కొరవడింది. కాలనీల ప్రధాన వీధుల వెంట ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోతున్నది. ప్రకాశ్‌రెడ్డిపేట, తెలంగాణ జంక్షన్‌లో నేషనల్ మార్ట్ వెళ్లే రహదారిలో రోడ్డుపై చెత్త పెద్దఎత్తున పేరుకుపోయింది. శునకాలు చేరి ఆ చెత్తనంతా చిందరవందరగా చేయడంతో రోడ్డంతా చెత్తమయంగా మారింది. న్యూశాయంపేట, రెవెన్యూ కాలనీ, జులైవాడ తదితర కాలనీలకు ప్రజలు ఈ రోడ్డు నుంచే వెళ్తుంటారు. చెత్త చేరడంతో దుర్వాసన వస్తుండటంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చీకటి పడిందంటే చాలు ఆ దారిలో దోమల బెడద తీవ్రమై అటునుంచి వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి అక్కడి నుంచి వెంటనే చెత్త తరలించాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు. అంతే కాకుండా జనావాసాల నడుమ చెత్త వేయకుండా స్థానికులకు అవగాహన కల్పించాలంటున్నారు.

## తండ్రి స్మారకార్థం శ్మశాన వాటిక..

**రూ. 1.50 లక్షలతో నిర్మాణం**



చిర్ర యాదగిరి స్మారకార్థం నిర్మించిన శ్మశానవాటిక

నెల్లికుదురు, జనవరి 5: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో చిర్ర యాదగిరి స్మారకార్థం ఆయన కుమారులు రూ. 1.50 లక్షలతో గ్రామస్తుల సౌకర్యార్థం శ్మశాన వాటికను నిర్మించారు. గతంలో శ్మశాన వాటిక ఉన్నప్పటికీ పెద్ద చెరువు సమీప కాలనీ ప్రజలకు దూరంగా ఉండడంతో ప్రభుత్వ అనుమతులు తీసుకుని పెద్ద చెరువులో సొంత ఖర్చులతో నిర్మించినట్లు చిర్ర యాకాంతం గౌడ్, వెంకట్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో నాయ కులు, గ్రామ పెద్దలు యాకయ్య, మురళి, అశోక్, మహిపాల్, రమేశ్, రాకేశ్, సుమన్, అజీమ్, సోమయ్య, ఉమేశ్, లింగమూర్తి, సుధాకర్, ఉప్పలయ్య, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## అమాయకులను బలిగొంటున్న మావోయిస్టులు

**ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్**

ములుగు, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారని ములుగు ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ అన్నారు. ఆదివారం జిల్లాలోని ముత్యంధార అటవీ ప్రాంతంలో ప్రెషర్ బాంబు పేలి వెంకటాపురం(నూగూరు) మండలం అంకన్నగూడెం గ్రామానికి చెందిన బొగ్గుల నవీన్ గాయపడిన నేపథ్యంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీలు, యాత్రికులు, భక్తులు, అటవీ ఉత్పత్తుల సేకరణకు వెళ్లే వారిని సైతం టార్గెట్ చేస్తూ నిత్యం నడిచే కాలిబాట వెంట మందుపాతర్లను అమర్చుతున్నారని పేర్కొన్నారు. కర్రె గుట్టలను గెరిల్లా బేస్‌గా మార్చే ప్రయత్నంలో భాగంగా మావోయిస్టులు మందు పాతర్లు అమర్చుతున్నారన్నారు. ప్రజలు అడవుల్లోకి వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పదంగా ఉన్న మందు పాతర్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు భయపడొద్దని, రక్షణ నిమిత్తం పోలీసు శాఖ నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతున్న మావోయిస్టులకు ఎవరూ సహకరించొద్దన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజా సంఘాలు స్పందించాలని ఎస్పీ కోరారు.



డైరీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## పేద రెడ్డి కుటుంబాలను ఆదుకోవాలి

మడికొండ, జనవరి 5: రెడ్డి సంఘాన్ని విస్తరించి సభ్యత్వాలు పెంచాలని, వెనుకబడిన రెడ్డి కుటుంబాలను ఆదుకోవాలని ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వారు హాజరై నూతన సంవత్సర డైరీలు ఆవిష్కరించారు. అనంతరం సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. రెడ్డి సంఘం యువజన విభాగం, మహిళా విభాగం ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసి సంఘం అభివృద్ధికి ఏమైనా సలహాలు, సూచనలుంటే తెలుసుకోవాలన్నారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్‌రామిరెడ్డి, సంఘం కార్యవర్గ సభ్యులు హనుమారెడ్డి, చాడ సునీల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, వసుంధర, సత్యనారాయణరెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, సంపత్‌రెడ్డి, కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి, స్వాతిరెడ్డి, వరదారెడ్డి, తిరుమలారెడ్డి, సీతారాంరెడ్డి, కటంగూరు రాంగోపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, సంజీవరెడ్డి, వీరారెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఎన్ అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రెషర్ బాంబు పేలి యువకుడికి గాయాలు

- వంట చెరుకు కోసం అడవికి వెళ్లగా ప్రమాదం
- 4 కిలో మీటర్ల మోసుకొని వచ్చిన సహచరులు
- 108లో ఏటూరునాగారానికి తరలింపు

వెంకటాపురం (నూగూరు)/ ఏటూరునాగారం, జనవరి 5: అటవీ ప్రాంతంలో అమర్చి ప్రెషర్ బాంబు పేలి యువకుడికి గాయాలైన ఘటన ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండలం వీరభద్రవరం ముత్యాధర అటవీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జరిగింది. తెలిసిన వివరాలు ఇలా ప్రకారం.. మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన బొగ్గుల నవీన్, నరసింహారావు, ఎడమయ్య అనే ముగ్గురు కట్టెల కోసం ముత్యంధార అటవీ ప్రాంతంలోకి కాలి నడకన వెళ్లారు. నవీన్ అనుకోకుండా ప్రెషర్ బాంబుపై అడుగు వేయడంతో అది పేలి తీవ్ర గాయపడ్డాడు. నడవలేని స్థితిలో కింద పడిపోయిన నవీన్‌ను అతడి వెంట వెళ్లిన నరసింహారావు, ఎడమయ్య కట్టెకు కట్టుకొని భుజాన మోసుకుంటూ అటవీ ప్రాంతం నుంచి సుమారు 4 కిలో మీటర్ల మేర గాయపడిన నవీన్‌ను మోసుకుంటూ వస్తూ 108 వాహనానికి సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న 108 వాహనం ఘటనా స్థలానికి చేరుకునే పరిస్థితి లేకపోవడంతో సిబ్బంది ఘటన స్థలానికి కొంతదూరం నడుచుకుంటూ వెళ్తుండగా, మోసుకొని వస్తున్న వారు ఎదురయ్యారు. దీంతో 108 సిబ్బంది సైతం వాహనం వద్దకు మోసుకొచ్చి వాహనంలోకి ఎక్కించారు. నవీన్ పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కాగా, అటవీ ప్రాంతంలో పేలిన ప్రెషర్ బాంబు మావోయిస్టులే అమర్చారా...? లేక వన్య ప్రాణుల వేట కోసం మరెవరైనా అమర్చారా...? అనేది తేలాల్సి ఉంది. రెప్పపాటులో జరిగిన ఈ ప్రమాదంలో నవీన్ తీవ్రగాయాలతో బయటపడడంతో వెంట వెళ్లిన ఇద్దరు సహచరులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ప్రమాదానికి గల కారణాలు పోలీసులు తేల్చాల్సి ఉంది.



నవీన్‌ను మోసుకొస్తున్న తోటి సహచరులు, 108 సిబ్బంది, చికిత్స పొందుతున్న బాధితుడు